# ఆవు గాండ్రించును

ఆవు 'అంబా' అనును.

గాడిద ఓండ్రు పెట్టును.

కాకి నల్లగా వుండును.

చింతపండు పుల్లగా వుండును.

రామ్మూర్తి దేశమును ఉద్ధరించును.

ఈ పై స్టేట్‌మెంట్స్‌లో- మొదటి నాలుగింటిలోనూ ఏమైనా అనుమానకీ అసత్యానికీ ఆస్కారం వుంటే వుండొచ్చుగాని, 'రామ్మూర్తి దేశాన్ని వుద్ధరిస్తాడు' అన్న మాటలో మటుకు ఎంతమాత్రం సందేహంలేదు. ఢంకా మీద దెబ్బకొట్టి చెప్పొచ్చు!

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు రామ్మూర్తి పన్నెండేళ్ళ వయసునుంచే దేశాన్ని వుద్ధరించటం మొదలెట్టాడట! అసలు వాళ్ళ వంశమంతా దేశోద్ధారకులూ దేశసేవకులేనట!

నేను యిప్పుడుంటున్న టౌనుకి రామ్మూర్తి మునిసిపల్ ఛైర్మన్ కావటంతో ఆయన దేశోద్ధరణ కార్యక్రమాలు కళ్ళారా చూసి తరించే భాగ్యం నాకు లభించింది. పదేళ్ళుగా ఛైర్మన్‌గా వుండి, రామ్మూర్తి టౌన్‌ని చాలా వుద్ధరించాడు. ఎమ్మెల్యే అయి రాష్ట్రాన్నే వుద్ధరిద్దామనుకున్నాడుగాని ఎన్నికల్లో ఓడిపోయాడు.

అయినా నిరుత్సాహపడకుండా, మళ్ళీ ఎలక్షన్‌లు రాకపోతాయా, కనీసం బై ఎలక్షనన్నా రాకపోతుందా అనే ఆశతో- అకుంఠితమైన దీక్షతో దేశసేవ చేస్తూనే వున్నాడు.

రామ్మూర్తి కేవలం మునిసిపల్ ఛైర్మన్ మాత్రమే కాడు. ఆయనకింకా చాలా పదవులూ హోదాలూ వున్నాయి. ఒక ప్రధాన రాజకీయ పార్టీ పట్టణ సంఘానికి అధ్యక్షుడు, స్థానిక కళాశాల కమిటీకి కోశాధికారి బియ్యం వుత్పత్తిదారుల సంఘానికి గౌరవాధ్యక్షుడు, కో-ఆపరేటివ్ అర్బన్ బాంక్‌కి అధ్యక్షుడు, మరియూ పట్టణంలోని అనేకానేక సారస్వత సాంస్కృతిక సంఘసేవా సంస్థలకి పోషకుడు, సలహాదారుడూ ఎట్సెట్రా.

రామ్మూర్తి ఛైర్మన్ అయిందగ్గర్నించీ ఆ టౌన్‌లో- రోడ్లు బాగుచేయించుట, చెట్లు నాటించుట, సత్రములు నిర్మించుట, పాఠశాలలు నెలకొల్పుట- ఇత్యాది మంచి పనులు చాలా చేశాడు.

రామ్మూర్తిని కలుసుకోవాలనీ ఆ మహావ్యక్తితో కాస్సేపు మాట్లాడాలనీ నాకున్న కోరిక మొన్న ఆగస్టు పదిహేనుకి నెరవేరింది.

స్వాతంత్ర్య దినోత్సవం స్కూళ్ళలో తప్పకుండా జరుగుతుంది.

ఆడపిల్లల హైస్కూల్ హెడ్ మిస్ట్రెస్‌కి ఎందు చేతనోగాని, నా మీద అపారమైన గౌరవం ఏర్పడింది. 'స్వాతంత్ర్యపు దినోత్సవ శుభదినాన మా పాఠశాలయందు జరుగబోవు కార్యక్రమమునకు విచ్చేసి ఉపన్యసించవలసిన దని'- నన్నాహ్వానించి ఆ గౌరవాన్ని ప్రకటించింది.

సదరు కార్యక్రమంలో ఛైర్మన్ రామ్మూర్తిగారు జెండా ఎగరేస్తారని కూడా చెప్పింది.

ఒహో ఎంత అదృష్టం! రామూర్తివంటి దేశోద్ధార కుడు పాల్గొంటున్న కార్యక్రమంలో ఉపన్యసించటమంటే మాటలా! వెంటనే వొప్పేసుకున్నాను.

స్వాతంత్ర్య దినోత్సవం ఆడపిల్లల హైస్కూల్లో ఉత్సవస్థాయిలోనే జరిగింది. పంతులమ్మల్లో చాలామంది పట్టుచీరెలు కట్టుకుని, పువ్వులు పెట్టుకుని అనకూడదుగాని- గర్భాదానంగదిలో కెళ్ళే పెళ్ళికూతుళ్ళలా ముస్తాబై వచ్చారు. కన్నులపండువుగావుంది. ఎక్కడ చూసినా పువ్వులు... జెండాలు...

రామ్మూర్తి టౌన్‌లో యింకా మూడు నాలుగు

చోట్ల జెండాలెగరేసి రావలసిన సమయానికి అరగంట మాత్రం ఆలస్యంగా వచ్చాడు. వేదికమీదికి రాగానే పిల్లలంతా హర్షధ్వానాలు చేశారు.

ప్రధానోపాధ్యాయిని నన్ను రామ్మూర్తికి పరిచయం చేసింది. "మీగురించి విన్నాను. మిమ్మల్ని కలుసుకున్నందుకు సంతోషం" అన్నాడు. "ఆహా ఎంత వినయశీలి" అనుకున్నాను.

ముందు నేనే మాటాడాల్సివచ్చింది.

రామ్మూర్తిలాంటి దేశోద్ధారకుల ఉపన్యాసాలు చాలామందిని చాలా ఏళ్ళుగా వింటూన్నవాణ్ణి గనక, ఇలాంటి సందర్భాలలో మాటలాడవలసిందేమిటో కంఠతా వచ్చు నాకు.

ఆ ధైర్యంతోనే లేచి "దేశమును ప్రేమించుడు, దేశాభివృద్ధికై కృషిచేయుడు, వంకాయకూర భుజింపుడు" ఈ ధోరణిలో ఓ అరగంట దంచేసి కూర్చున్నాను.

రామ్మూర్తి ఎలా అయినా గొప్పవాడు. పైగా దేశోద్ధారకుడు. అంచేత నాకంటే ఆయనే గొప్పగా ఉపన్యసించాడు.

స్కూల్ బాగుందన్నాడు. హెడ్‌మిస్ట్రెస్ బాగుందన్నాడు. మనదేశానికి స్వాతంత్ర్యమొచ్చిందన్నాడు! వచ్చి చాలా సంవత్సరాలైందన్నాడు.

ఈ దేశంలో గాంధీ పుట్టాడట. నెహ్రూ పుట్టాడట. తను పుట్టాడట. అంచేత ఈ దేశం గొప్పదన్నాడు.

మీరంతా తలో యిందిరాగాంధీ కావాలన్నాడు. "మీ స్కూల్‌కి ఏమవసరం వచ్చినా నాతో చెప్పండి" అన్నాడు. "మీకేం అవసరం వచ్చినా నా దగ్గరకి రండి, తీరుస్తాను"-అని, హెడ్ మిస్ట్రెస్‌కి సభా ముఖాన వాగ్దానం చేశాడు గోగడ చాలాసార్లు చాలామంది అవసరాలు తీర్చాట్ట. ఆ మాట కూడా చెప్పాడు.

ఈ రకంగా దాదాపు గంటసేపు అనర్గళంగా ఉపన్యసించి, జెండా ఎగరేశాడు.

స్కూల్ గ్రామఫోన్ రికార్డుకి దేశభక్తి మరీ ఎక్కువై పోయి-"అధినాయక...అధినాయక ..అధినాయక.." అంటూ పాడిందే పాడ్డం మొదలెట్టేసరికి, జనగణమన అధినాయకుడై నటువంటి రామ్మూర్తికి కోపమొచ్చి తనే పాడ్డం ప్రారంభించాడు. ఆయనతో పాటు అందరూ పాడారు ఆ తరువాత పిల్లలందరికీ వంతులమ్మాల సాయంతో మిఠాయిలు పంచి పెట్టాడు రామ్మూర్తి.

కార్యక్రమమంతా ముగిశాక, కాస్సేపు హెడ్ మిస్ట్రెస్ గదిలో కూర్చున్నాం ఆ సందర్భంలో ఆవిడ రామ్మూర్తికి ఒక విజ్ఞప్తి చేసింది. స్కూల్‌కి ప్లే గ్రాండు లేదుట. చుట్టుపక్కల ఎక్కడన్నా స్థలమిప్పించమని వేడు

తుంది. రామ్మూర్తి కాసేపు ఆలోచించి- 'ఓశ్! అదెంత పని' అన్నాడు.

స్కూల్‌కి వెనకవేపు కాస్త ఎడంగా వంద, నూట యాభై దాకా గుడిశెలున్నాయి. ఆ స్థలమంతా మునిసిపాల్టీదట.

"ఈకూలినాకొడుకులంతా ఆళ్ళ బాబుగాడిసొత్తయినట్టు గుడిశె లేసేశారు...పీకించేసి ఇస్కూలుకిచ్చేత్తా..." అని హెడ్ మిస్ట్రెస్‌కి వాగ్దానం చేశాడు రామ్మూర్తి.

హెడ్ మిస్ట్రెస్ కాఫీ యిచ్చింది. తాగేసి కారెక్కి వెళ్ళిపోయాడు రామ్మూర్తి. హెడ్ మిస్ట్రెస్ దగ్గర శెలవు తీసుకుని స్కూలు గేటు దాటి బయటికొచ్చాను.

స్వాతంత్ర్య దినోత్సవం స్కూల్లో వుంది.

అక్కడక్కడా ఎగురుతున్న జెండాల్లో వుంది. రామ్మూర్తి ఉపన్యాసంలో వుంది. పంతులమ్మల ముస్తాబులో వుంది. స్వీట్లకోస మొచ్చిన స్కూల్ పిల్లలలో వుంది.

అంతే. ఇంకెక్కడా లేదు.

రోడ్డుమీద రొప్పుతూ తొక్కలేక తొక్కలేక తొక్కుతున్న రిక్షావాడి మొహంలో లేదు. రోడ్డుపక్క చెప్పులు కుట్టే ముసలివాడిలో లేదు. మునిసిపాల్టీ చెత్తకుండీ దగ్గర చెత్తలో ఎందుకోసమో వెదుక్కుంటున్న ముష్టి కుర్రాడి పదేళ్ళ పసిమొహంలో అసలు లేదు.

మా యిల్లు స్కూల్‌కి దగ్గరే. మెల్లగా నడుచుకుంటూ బయల్దేరాను. స్కూల్ దాటాక ఆ వెనకవున్న గుడిశెలవేపు చూశాను. ఈ స్వాతంత్ర్య దినోత్సవమన్నది అక్కడసలే లేదు. గుడిశెలు ఎప్పటిలాగే యిరుకు యిరుగ్గా వున్నాయి. గుడిశెలలో మనుషులు ఎప్పటిలాగే మురికి మురిగ్గా, చీదరగా, ఆకలిగా, అస్థిపంజరాల్లా వున్నారు. ఈ గుడిశెలన్నీ పీకేస్తే - వీళ్ళంతా ఏమైపోతారోనన్న సందేహ మొచ్చింది నాకు. సమాధానం దొరకలేదు.

○ ○ ○

వారంరోజుల తర్వాత సెకండ్ షో సినిమాచూసి వస్తున్న రామ్మూర్తిని ఎవరో పట్టుకుని ఎముకలోకి సున్నం లేకుండా చితకదన్నారు.

ఎవరు ?

పదేళ్ళుగా నిరంతరమూ పీడించబడ్తున్న మునిసిపాల్టీ వుద్యోగులా ?

లంచాలివ్వలేక నతమతమౌతున్న చిల్లర వ్యాపారస్థులా ?

మునిసిపల్ స్కూల్లో రెండొందల రూపాయల వుద్యోగం కోసం పదేపదే చెరచబడుతున్న ఆడ టీచర్ల అన్నలా ? భర్తలా ?

లేకపోతే - గుడిశెల్లో పుట్టి, పెరిగి, అక్కడ బ్రతుకుతూ - ఇన్నాళ్ళుగా బ్రతుకుతున్న గడ్డని ఖాళీచేసి, ఒకవంతు స్కూల్‌కి, మిగతా మూడువంతులూ చైర్మన్ బావమరది కట్టబోయే సినిమాహాల్‌కి యివ్వటం యిష్టంలేనికూలి జనమా ?

ఏమో, ఎవరైనా కావచ్చు.

రామ్మూర్తి దేశోద్ధరణ కార్యక్రమాలకి అంతరాయం కలిగింది.

ఆవు 'అంబా' అనును

పెద్దపులి గాండ్రించును

రామ్మూర్తి ఆవు వేషం వేసుకున్న పెద్దపులి

—o—